

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 19745 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 63.330 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 250, ఎన్‌ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు 500, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.518 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## రెండు రోజుల జిల్లా పర్యటనలో ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు

- 4వ తేదీ సాయంత్రం జిల్లాలోని అందరు తహసిల్దారులతో సమావేశం
- 5వ తేదీ ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘ నాయకులతో సమావేశం
- డివిజన్ స్థాయిలో కార్యవర్గ బలోపేతానికి సన్నాహాలు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సెప్టెంబర్ 4,5 తేదీలలో రెండు రోజులపాటు నెల్లూరులో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఏపీ జేఏసీ అమరావతి జిల్లా సమావేశాల్లో పాల్గొంటారు. తేది 04 మధ్యాహ్నం 3.00 గంటలకు నెల్లూరు నగరంలో తహశీల్దార్ల సమావేశం జరుగుతుంది. రెవెన్యూ శాఖ గౌరవానికి భంగం కలగకుండా, ప్రజలలో నమ్మకాన్ని పెంచే విధంగా రెవెన్యూ శాఖలో జవాబుదారీ, వేగవంతమైన, పారదర్శకత తో కూడిన రెవెన్యూ పాలనలో తహసీల్దారుల పాత్ర" అనే అంశంపై జిల్లాలోని అందరు తహసిల్దార్లతో సమావేశం నిర్వహించి, ప్రజల హక్కుల పరిరక్షణకు, భూసంబంధిత రికార్డుల నిష్పక్షపాత నిర్వహణకు, పారదర్శకతతో కూడిన సేవా నిబద్ధతతో, అంకిత భావంతో ప్రజలకు సేవలందించేందుకు, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, రెవెన్యూ సేవలను అందించేందుకు, విధుల పట్ల నిజాయితీతో, నిష్ఠతో పనిచేసేందుకు ఈ సమావేశం ద్వారా తహసీల్దార్లు కు స్ఫూర్తిని అందించనున్నారు. 5వ తేదీన జరగనున్న ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాల సమావేశం ద్వారా జిల్లా స్థాయిలో మరియు డివిజన్ల స్థాయిలో పటిష్టమైన కార్యవర్గ ఏర్పాట్ల గురించి చర్చించి, సంస్థాగతంగా జిల్లా మరియు డివిజన్ కార్యవర్గాల ఏర్పాటుపై చర్చించనున్నారని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షులు అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా కార్యదర్శి కె. డానియల్ పీటర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ. ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి వేడుకలు



**ఆత్మకూరు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** మహానేత దివంగత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి వేడుకలను మంగళవారం ఆత్మకూరులోని శ్రీమేకపాటి గౌతంరెడ్డి మెమోరియల్ మున్సిపల్ బస్టాండ్ కాంప్లెక్స్ ఆవరణలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, రాష్ట్ర మున్సిపల్ విభాగ జనరల్ సెక్రటరీ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ కొండా వెంకటేశ్వర్లు, యువ నాయకుడు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి యూత్ ప్రెసిడెంట్ నాగసుబ్రహ్మణ్యంరెడ్డి, తోడేటి మణి, చిల్లూరు వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులురెడ్డి, వాసిపల్లి లక్ష్మీరెడ్డి, బంక వెంకటేశ్వర్లురెడ్డి, జమ్రు, కోర్సిపాటి వెంకటరామిరెడ్డి, ఆంద్రా సుబ్బారెడ్డి తోడేటి అశోక్, ఖాజావలి, మీరా మొహిద్దీన్, కృపాకర్, మహిళా నాయకులు కల్పన, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాయపూడిలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సందర్శించిన మంత్రి నారాయణ

- మంత్రి నారాయణ కామెంట్స్



**నెల్లూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త-వైద్యం** 3లక్షల చదరపు అడుగులతో సీఆర్డీఏ కార్యాలయం నిర్మాణం జరుగుతోంది. 2014-19 లోనే ఈ కార్యాలయం పనులు చాలా వరకు పూర్తయ్యాయి. గత ప్రభుత్వం మూడు ముక్కలాటతో నిర్మాణాలు మధ్యలో నిలిపేసింది. సీఆర్డీఏ కార్యాలయం కోసం ప్రతిసారి అమరావతి నుంచి విజయవాడ వెళ్లాల్సి వస్తుంది. కొన్ని మున్సిపల్ డిపార్టుమెంట్లు మంగళగిరి, తాడేపల్లిలో ఉన్నాయి. ప్రజలకు పాలన సులభం చేయడానికే సీఆర్డీఏ కార్యాలయ భవనం ఏర్పాటు చేశాం. ఈ నెలాఖరులోగా మంచి రోజు చూసి సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభిస్తాం.

## సర్వీస్ రిక్వెస్ట్ లను నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయండి

- కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** రెవెన్యూశాఖ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ ఐ.జి.ఆర్.ఎస్ అసెస్మెంట్ లను క్రమం తప్పకుండా పరిశీలించి ఆన్లైన్లోనే పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా అడ్మిన్ కార్యదర్శుల లాగిన్ లలో ఉన్న సర్వీస్ రిక్వెస్ట్ లను వేగవంతంగా క్లియర్ చేసి ప్రజలకు అందించాల్సిన పౌర సేవలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలోనే మున్సిపల్ శాఖ రికార్డులలో స్థల యజమాని పేరు బదలాయింపు జరిగే నూతన విధానం అయిన ఆటోమ్యుటేషన్ పై వివిధ రకాల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టి.పి.ఆర్.ఓ వాసుబాబు, రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణ చైతన్య, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, రెవెన్యూ సూపర్ ఇంటెండెంట్ చినబాబు, ఇన్స్పెక్టర్ లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికిన ఆర్యవైశ్యులు

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సేవలో తరించిన ఎమ్మెల్యే



**బుచ్చి సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి 11 వవార్డు పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆర్యవైశ్యులకు ఆమెకు ఘన స్వాగతం పలికారు ఆమె వెంట చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ కూడా ఉన్నారు.శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యేకి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జొన్నవాడ దేవస్థానం ట్రస్టు బోర్డుమెంబర్ యిమ్మడిశెట్టి సౌజన్య లక్ష్మీ, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఎంవి శేషయ్య, తిరివీధి రాధాకృష్ణయ్య, ఇనుగూరు సుబ్బారావు, దర్శిబాలు, యిమ్మడిశెట్టి సుబ్బారావు, యిమ్మడిశెట్టి మల్లికార్జున, దర్శి వెంకటేశ్వర్లు, రాచూరు శ్రీనివాసులు, సిద్ధివిఘ్నేశర దేవస్థానం చైర్మన్ చంగలరాజు, గుబ్బా సురేష్, రాచూరు మాల్యాద్రి, గాదంశెట్టి ఆదినారాయణ, సీనియర్ ఆర్యవైశ్య నాయకులు ఇనుగూరు బాలయ్య తదితరులున్నారు.

## చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం అదృష్టం

### డిప్యూటి సిఎం జన్మదినం కేకును కట్ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి



**బుచ్చి సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని 11 వవార్డులో పర్యటించిన సందర్భంగా ఆమె ప్రజల వద్ద సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో గుడిపల్లి కాలువ దుర్గంధ భరితంగా ఉందని 50 లక్షల వ్యయంతో గుడిపల్లి కాలువలో పూడిక తీయించడంతోపాటు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఈకాలువ విషయం పట్టించుకున్న ధాఖలాలు లేవని విమర్శించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం పురస్కరించుకొని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ మండపంలో బారీ కేకును కట్‌చేశారు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, టిడిపి అర్బన్ మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు,కమీషనర్ బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, కోటంరెడ్డి లలితారెడ్డి, అందె ప్రత్యూషా, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, కో ఆప్షన్ మెంబర్ దస్తగిరి, కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ టంగుటూరు మల్లికార్జు నరెడ్డి,. సీనియర్ నాయకులు ఎంవి శేషయ్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, దుగ్గిశెట్టి హరినాద్, వల్లూరు శ్రీనివాసులు, దశరద్, ఆరకె రవి, మైనార్టీ నాయకులు సుభానీ, బిసి నాయకులు బండ్ల కొండ య్య, మైనార్టీనాయకు రాలు ఫర్వీనా,షబ్బీర్, జనసేన నాయకులు మాదవ్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిపక్ష హోదా అడుక్కుంటే రాదు.. ప్రజలివ్వాలి

- పులివెందుల ప్రజలకు కూడా ఎంట్రీ పాస్ లా
- నియంత పోకడల నుంచి బయటకు రాలేకపోతున్న జగన్ రెడ్డి
- వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం
- ఏ ఊరికి వెళ్లినా ప్రజలు మమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నారు
- గొడ్డలి పోటుతో చిన్నాయన్ని లేపేసిన మీరా మా నాయకుడి గురించి మాట్లాడేది
- ఇప్పటికైనా కొంచెం కాకపోతే కొంచెమైనా బుద్ధితో మాట్లాడండి
- నెల్లూరులో మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త వైద్యం** గతంలో సకల శాఖల మంత్రిగా వెలగబెట్టిన సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదం అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. దమ్ము ధైర్యంఉంటే వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంట ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఎన్ని సార్లు అడుక్కుంటారా. సంవత్సరం మూడు నెలల నుంచి అడుక్కోవడమే పనా, పులి వెందుల జడ్పీటీసీ గెలిపించుకోలేని జగన్‌రెడ్డిని కలవాలంటే ఎంట్రీ పాస్ ఉండాలంట. సొంత నియోజకవర్గం, సొంత మండల ప్రజలు కలవాలంటే కూడా పాస్ తీసుకోవాలంట. ఇవన్నీ జగన్‌రెడ్డి నియంతపోకలకు నిదర్శనం. ఐదేళ్ల దరిద్రం పట్టించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. కూటమి పాలనలో మేం ఏ ఊరికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మీరు అమ్మఒడి ఒక బిడ్డకు ఇస్తే మేం తల్లికి వందనం ఎంత మంది బిడ్డలకైనా ఇస్తున్నాం. రైతు భరోసా అని మీరు రైతులకు రూ.7500 ఇస్తే, మేం అన్నదాత సుఖీభవగా రూ.13500 ఇస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించాం. దీపం పథకంతో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. చేనేత కార్మికులు, మత్స్యకారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంది. దళితులు, గిరిజనులకు పక్కా ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే మొత్తాన్ని మీరు రూ.1.55 లక్షలకు పరిమితం చేయడంతో పాటు అందులోనూ లూటీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి మేం రూ.2.55 లక్షలతో ఇళ్లు కట్టిస్తున్నాం. ఇన్నీ చేసిన మేం ప్రజల్లోకి వెళ్లేందుకు ఎందుకు భయపడతాం. ప్రజలే మమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. సొంత చిన్నాయనపై గొడ్డలి పోటు వేసిన మీరా మా నాయకుడు చంద్రబాబునాయుడు గురించి మాట్లాడేది. అప్పట్లో ఓ మహిళ నుంచి పార్టీని కాపాడుకునేందుకు అందరం కలిసి ప్రజాస్వామ్యయుతంగా చంద్రబాబునాయుడుని ఎన్నుకున్నాం అన్నారు. ఈ రోజుకి ప్రజలు చంద్రబాబునాయుడి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీని ఆదరిస్తూ గెలిపించుకుంటున్నారు. వెన్ను పోటు అయితే ప్రజలు ఆదరిస్తారా, మీరు చిన్నాయనపై గొడ్డలి పోటు వేసి, ఆ నెపాన్ని మాపై నెట్టి 2019 లో గెలిచారు. ప్రజలు అంతా గ్రహించాకే మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. ఇప్పటికైనా కొంచెం కాకపోతే కొంచెమైనా బుద్ధితో మాట్లాడాలని వైసీపీ నేతలకు హితవు పలుకుతున్నాం అన్నారు.

## తట్ట మట్టి తోలకుండానే రూ.20 లక్షలు స్వాహా

- జగనన్న కాలనీ చదును పేరుతో కోర్టు ఉత్తర్వుల ద్వారా బిల్లులు పొందిన వైసీపీ నేతలు
- వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులపై చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ సీరియస్ గా తీసుకుని ప్రతి రూపాయి రికవరీ చేయాలి
- అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** ముత్తుకూరు పరిధిలోని బోడిస్వామికండ్రిగ వద్ద వైసీపీ నేతలు అక్రమంగా బిల్లులు చేసుకున్న జగనన్న లేఅవుట్‌ను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డితో కలిసి కాలనీని సందర్శించిన సమయంలో విస్తుపోయే వాస్తవాలను వెలుగులోకి స్థానికులు తీసుకొచ్చారు. జగనన్న కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో తట్ట కాదు కదా గెంటె మట్టి కూడా తోలలేదని, పైగా ఇక్కడి మట్టిని బయటకు తోలుకుని అమ్ముకున్నారని స్థానిక ప్రజలు వెల్లడించారు. వైసీపీ నేతల అక్రమాలకు అధికారులు పూర్తిగా సహకరించారని, అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజానీకం డిమాండ్ చేసారు.

**ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ**

బోడిస్వామి కండ్రిగ వద్ద జగనన్న కాలనీ పేరుతో జరిగిన బారీ కుంభకోణంపై ఈ రోజు ఓ ప్రధాన పత్రికలో ఒక వార్త ప్రచురించారని, వాస్తవాలను పరిశీలించేందుకు కూటమి నాయకులతో కలిసి ఇక్కడకి వచ్చామన్నారు. ఒక్క తట్ట మట్టి తోలకుండానే రూ.25.80 లక్షల బిల్లు అప్ లోడ్ చేశారన్నారు. రూ.20 లక్షల వరకు డబ్బు కూడా తీసేసుకున్నారు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తట్ట మట్టిన తోలిన ఆనవాళ్లు లేవు..పైగా ఇక్కడ మట్టినే బయటకు తోలుకున్నారని స్థానికులు చెప్పారని తెలిపారు. వైసీపీ ఎంపీపీ భర్త 2021లో జగనన్న రాజ్యం నడుస్తున్న రోజుల్లో జగనన్న కాలనీ పేరుతో ఈ ఘనకార్యం చేశారని అన్నారు. ఎస్సీలకు సంబంధించిన 4.60 ఎకరాల భూమికి పరిహారం సైతం చెల్లించలేదని, జగనన్న కాలనీ కోసం సేకరించిన భూమికి పరిహారం ఇవ్వకుండానే మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు. పైగా బయట నుంచి మట్టి తోలామని బిల్లులు చేసుకున్నారు. ఎస్టీల భూములకు సంబంధించి నామమాత్రంగా కొంత మొత్తం వారికి చెల్లించి మిగిలిన మొత్తాన్ని కొందరు పెద్దమనుషులు భోంచేసినట్టు కూడా తెలుస్తోందన్నారు. రూ.25.80 లక్షల బిల్లు పెడితే క్వాలిటీ అధికారుల క్లియరెన్స్ కోసం 25 శాతం ఆపి రూ.19.35 లక్షలు చెల్లించేశారని, పనులు చేశామని బిల్లులు పెట్టమనగానే అధికారులు అప్ లోడ్ చేసేశారు. కోర్టును ఆశ్రయించి బిల్లులు తీసేసుకున్నారని, వాస్తవ పరిస్థితిని కోర్టు దృష్టిలో పెట్టాల్సిన అధికారులు ఎందుకు ఆ పనిచేయలేకపోయారన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఎంబుక్ లో సంతకాలు పెట్టిన వారిని సస్పెండ్ చేయడంతో పాటు బిల్లులు పొందిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని తెలిపారు. హైకోర్టులో అప్పీల్ వేసి వాస్తవ పరిస్థితిని వివరించాల్సిన బాధ్యత కూడా అధికారులదే అన్నారు. ఎంబుక్‌లో నమోదు చేసే సమయంలో మరో ప్రదేశంలోని ఫొటోలు తీసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలే లక్ష్యంగా వైసీపీ పాలనలో దోపిడీకి పాల్పడ్డారన్నారు. వెంకటాచలం మండలం సర్వేపల్లిలోనూ ఎస్టీల భూములు 6.30 ఎకరాలను ఓ కంపెనీకి అమ్మేసి వైసీపీ పెద్దరెడ్లు సొమ్ము చేసుకున్నారని, బోడిస్వామి కండ్రిగ కాలనీలో ఉన్న మట్టిని బయటకు తోలుకున్న తర్వాత ఏర్పడిన గుంతల్లో పేదలు ఇళ్లు కట్టుకోవాలా వైసీపీ నాయకుల కరోనా హౌస్ లు, పెద్ద భవనాలు ఈ గుంతల్లో కడుతారా..పేదలంటే అంత నిర్లక్ష్యమో అని వాపోయారు. రూ.25 లక్షల పనిచేసి ఓ రెండు లక్షలో, మూడు లక్షలో మిగిలించుకున్నా రంటే ఒక అర్థం ఉందన్నారు. తట్ట మట్టి ఎత్తకుం డానే ఇక్కడి మట్టి అమ్ముకుని, మళ్లీ బిల్లులు చేసుకో వడం లాంటి దుర్మార్గాలు ఎక్కడా చూడబోమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ అక్రమాలను సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టాలి **బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ** వైసీపీ పాలనలో జగనన్న కాలనీల పేరుతో అరాచకాలు సృష్టించారు. ఎస్సీ, ఎస్టీల కోసం ఏర్పాటు చేసిన కాలనీల్లో మట్టి తోలకపోగా, ఉన్న మట్టిని అమ్మేసుకుని బిల్లులు చేసుకోవడం దురదృష్టకరం. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వైసీపీ ఇష్టమొచ్చినట్టు దుర్వినియోగం చేసామన్నారు. వైసీపీ నేతల స్వాహాకు సహకరించిన అధికారులందరినీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు స్వాహా చేసిన సొత్తును రికవరీ చేయాలన్నారు. ప్రజల సొత్తును కాజేసిన వారిని అరెస్ట్ చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షుడు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, రాగల శివకృష్ణ, దండు శ్రీనివాసులు, దేవస్థానాలు చైర్మన్ మోలా శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు ఆలిముత్తు మత్స్యకార విభాగ నాయకులు అక్కయ్యగారి ఏడుకొండలు, సుంకర శ్రీనివాసులు, విక్రమ్, నన్నం దీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్‌కి ఘన నివాళి తెలిపిన వైసీపీ నాయకులు

**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ, వైఎస్ఆర్సిపి నేతలు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్ర వేసిందని, నెల్లూరు సంఘం బ్యారేజీలు, కృష్ణపట్నం పోర్ట్, అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆయన కృషితోనే సాధ్యమయ్యాయని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, 2 రూపాయల బియ్యం పథకాలు సాధారణ ప్రజలకు బలమైన అండగా నిలిచాయని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో వైఎస్ఆర్ విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని అన్నారు. 108, 104 సేవలు, రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, యువతకు ఉపాధి కల్పన కోసం స్థాపించిన సెజ్‌లను ప్రస్తావించారు. చంద్రబాబు పాలన చీకటి పాలనగా మారిందని, ఈ పరిస్థితుల్లోనే ప్రజలు వైఎస్ఆర్, జగన్ పాలన విలువను అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరింత మెరుగైన సంక్షేమాభివృద్ధి పాలన అందిస్తున్నారని నేతలు అన్నారు.



# పౌష్టికాహారంతో వ్యాధులకు దూరం



**కావలి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** సమాజంలో సమతుల్యమైన ఆహారం తీసుకొని వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించాలని డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి తెలియజేశారు కావలి పట్టణంలోని తుఫాన్ నగర్, ఇందిరానగర్ సచివాలయాల పరిధిలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్స వాలను మంగళవారం నిర్వహించడం జరిగింది కావలి డివిజన్ లింగ నిర్ధారణ నిషేధ కమిటీ సభ్యులు ఎం మాలకొండ రెడ్డి మాట్లాడారు గర్భవతులు, బాలింతలు మంచి పౌష్టిక ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం గా జీవించాలని వాడడం జరిగింది మనం తీసుకునే ఆహారంలో విటమిన్స్ మినరల్స్ ఆకుకూరలు పళ్ళు పాలు తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపినారు,ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ సుభాషిని మాట్లాడారు స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహారం పై వంటకాలు ఆకుకూరలు ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమానికి స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు ఏ జయంతి కుమారి ,ఎం ప్రభావతి ,ఏ జీవమ్మా ,సుజాత ,మహిళా సంరక్షణ అధికారి పావని గర్భవతులు బాలింతలు మహిళలు పాల్గొన్నారు

# పేదల హృదయాల్లో కొలువైన దేవుడు వైఎస్సార్




**కోవూరు,సెప్టెంబర్2 ప్రభాతవార్త :** భారత వేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయాని విధంగా అభివృద్ధి సంక్షేమంతో పేదల హృదయాల్లో కొలువైన దేవుడు నివంగత నేత రాజశేఖర్‌రెడ్డియే అని వైసీపీ నేతలు కొనియాడారు. కోవూరులోని మైథిలి సెంటర్ వద్ద దివంగత వైఎసార్ విగ్రహానికి మైదిలీ సెంటర్‌లో ఉన్న దివంగత నేత వైఎస్సార్‌వైఎసార్ విగ్రహానికి మంగళవారం ఆ మహనీయుని 16వ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. ఆ మహనీయుని వర్ధంతి పురస్కరించుకుని పూలమాల వేసి ఘన నివాళిల్పరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఆ మహనీయుడు ప్రవేశ పెట్టిన పథకాలు నేటికి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆరోగ్య శ్రీ ఫీజురియంబర్స్ మెంట్,108,104 పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగు నిపెంరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ రైతు అధ్యక్షుడు నరసింహులురెడ్డి,డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, మాజీ సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి,నల్లపరెడ్డి వైసీపీ నేతలు మండల పార్టీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జుబేర్‌బాషా, వెంకటరమణారెడ్డి, కె. ప్రసాద్,వైసీపీ గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, , శివకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, శ్రీధర్, రాజగోపాల్, శివకుమార్‌రెడ్డి, వంశీ, నాగరాజు, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణరెడ్డి,సుధాకర్‌రెడ్డి,శివకోటారెడ్డి,మల్లికార్జున, సాయి, గయాజుద్దీన్,లీగల్ సెల్ న్యాయవాదులు బి. చెంచురెడ్డి బాలకృష్ణ, మల్లికార్జున, పెద్దసంఖ్యలో నేతలు ఉన్నారు.

**– భారీ స్థాయిలో అన్నదానం** దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మైథిలి సెంటర్ ప్రాంతంలో భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గత సంవత్సరాలుగా మైథిలి సెంటర్ ప్రాంతంలో వైఎస్సార్ విగ్రహానికి విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం, తదితర వాటిని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న గౌతమ్ స్వీట్స్ అధినేత సుధాకర్‌రెడ్డిని ఈ సందర్భంగా వైసీపీ నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించారు.

# ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



**కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ కాటంరెడ్డి రామచంద్రారెడ్డి నగర్‌లో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆ ప్రాంతంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ప్రాంతంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈ చైతన్య, టీడీపీ నాయకులు బత్తల రమేష్ యాదవ్, డి. శ్రీనివాసులు నాయుడు, విన్నకోట రాధాకృష్ణ, ఫిరోజ్ , తదితరులు ఉన్నారు.

# నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి



**కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని కాలనీల్లో ప్రస్తుతం జరుగుతున్న గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారి వారి పరిధిలో నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులతో ప్రతి రోజూ మాట్లాడి ఆ నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా నూరుశాతం పూర్తయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ దిలీప్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

# సాంకేతిక రంగాల్లో ఏఐ వినియోగం విస్తరించింది



కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : ఏఐ భవిష్యత్తు కాదని, అది ఇప్పటికి మన రోజూ వారి జీవితంలో భాగమైందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐ ఈజ్ నాట్ ఫ్యూచర్ ఇట్ ఈజ్ ప్రజెంట్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, పరిశ్రమలు సమాచార సాంకేతిక రంగాల్లో ఏఐ వినియోగం పూర్తిస్థాయిలో విస్తరించిందన్నారు.ఈ ఏఐ సాంకేతికతను విద్యార్థులు పూర్తిగా అవగాహన చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో రిసోర్స్ పర్సన్‌గా టెక్ సొల్యూషన్ సంస్థ సీఈవో రవికిరణ్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.గాయత్రి, ఈ. చిట్టిబాబు, బి.వరలక్ష్మి, సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

# ప్రతి నెల 10లోగా ఎత్తు, బరువులు యాప్‌లో నమోదు చేయాలి



**కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** : పూర్వ ప్రాథమిక విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి నెల 10వ తేది లోగా చిన్నారుల యొక్క బరువు, ఎత్తు తూచి యాప్‌లో తప్పక నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన వేళలను పాటిస్తూ కేంద్రాలు తెరవాలన్నారు. చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. అదేవిధంగా గర్భవతులకు, బాలింతలకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని ఫేసియల్ యాప్‌లో వారికి అందజేయాలన్నారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# పచ్చిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి




కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : సాగు భూమికి బలాన్ని ఇచ్చే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగా 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు, మోదేగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. నిస్సారవంతమైన భూములను సారవంతంగా చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అదేవిధంగా వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సంబంధించిన అర్హత కలిగిన రైతులకు వారి ఖాతాల్లో నమోదు కాకపోతే వారి పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి టి. రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, మెహర్నిసా, తదితరులు ఉన్నారు.

# నేడు మూడు గంటల పాటు విద్యుత్ కోత



**కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం సబ్‌స్టేషన్‌లో నూతన 11 కేవీ బ్రేకర్‌ను ఏర్పాటు చేస్తున్నారని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఇనమడుగు, జమ్మిపాలెం, లేగుంటపాడు, చెర్లోపాలెం గ్రామాల్లో పై వేళల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, అత్యవసర పనుల గల వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# వైభవంగా పల్లకి సేవ



**కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివా రికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

# గోనుపల్లిలో మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత



**గోనువల్లి(రాపూరు), సెప్టంబరు2ప్రభాతవార్త** మండలంలోని గోనుపల్లి గ్రామంలోని బిసి కాలనీలో మంగళవారం మృతి చెందిన బత్తల నరసయ్య కుంటుంబానికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈగా రాజా రెడ్డి ఆర్థిక సాయం అంద జేశారు. నరసయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాజా రెడ్డి మృతుని నివాసానికి వెల్లి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరమార్శించారు. అనంతరం కర్మకాండల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ. 5వేల నగదు సాయం చేశారు. గ్రామంలో పేదలు మరణిస్తే వారి కర్మకాండలకు రాజారెడ్డి తన సోంత నిధుల నుండి రూ.5వేల నగదు సాయం అందిస్తున్నారు.

# చిరస్మరణీయుడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి




**బుచ్చి సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** రాష్ట్రచరిత్రలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన విదంగా 108,104, ఆరోగ్యశ్రీ,ఫీజురియంబర్స్ మెంట్ వంటి అద్భుత పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి దివంగతనేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అని మైనార్టీ నాయకులు వైసిపి టౌన్ అధ్యక్షులు షేక్.షాహుల్ కొనియాడారు. వైఎస్ఆర్ 16 వ వర్ధంతి సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సోమశిల 78 టిఎంసిలు చేసిన ఘనత దివంగత నేతకే దక్కిందని అన్నారు. అనంతరం రూరల్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి మాట్లాడుతు సంగం బ్యారేజి నిర్మాణం,నెల్లూరు బ్యారేజి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఘనత కూడా ఆయనకే దక్కిందని కొనియాడారు. అనంతరం 7 వవార్డు కౌన్సిలర్ షేక్ షకిలా బేగం మాట్లాడుతు ఆయన బాటలోనే ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తు అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెడుతు ఆదర్శముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు.. సంక్షేమం ,అభివృద్ధి అనే పథకాలకు నిర్వచనం చెప్పిన గొప్ప నాయకుడు వైఎస్ఆర్ అని ఆమె కొనియాడారు. అలాదే మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారి బాటలోనే నడిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని అన్నారు.ఈ సందర్బంగా నాయకులు నివాళులర్పించారు. వైఎస్ఆర్ విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించారువైసిపి మహిళా నాయకురాలు మోర్ల జయంతి, కౌన్సిలర్ కంతా అనంతమ్మ, కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ, రేబాల మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, వెంకయ్య, రేబాల నాయకులు సుబ్బారెడ్డి, రాజ్‌కుమార్, కౌన్సిలర్ యానాదిరెడ్డి , వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టండి



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఎంతో సదుద్దేశంతో పక్కా గృహాల కోసం విడుదల చేస్తున్న కేంద్రం నిధులు దుర్వినియోగం అవుతున్నాయని నెల్లూరు జిల్లా, బీజేపీ నాయకులు మిడతల రమేష్ అన్నారు. ఈ మేరకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి నిధుల దుర్వినియోగాన్ని వివరించారు. కేంద్ర నిధులు నిరూపయోగం కాకుండా సీఎంఒలో ఆగిపోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కోరారు. హౌస్ ఫర్ ఆల్‌కు కేంద్ర నిధులు 19 వేల కోట్ల రూపాయలను, హౌసింగ్ కార్పొరేషన్ వినియోగించిందని చెప్పారు. 3,47,226 గృహాలను కాంట్రాక్టర్లకు నిర్మాణాల బాధ్యత అప్పగించారని, వీటిలో 99 వేల గృహాలు పూర్తి చేసినట్లు ఫైనల్ బిల్లులు చెల్లించారని తెలిపారు. ఇందులో 98 వేల గృహాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. 91,555 గృహాలు బేస్మెంట్ లేవల్లో ఆపేశారని తెలిపారు. ఇందులో 80 వేలగృహాలకు స్టీలు, సిమెంటు ఇచ్చారని వాటిని కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుని నిర్మాణాలను ఆపివేశారని సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. లబ్దిదారులు ఆడగకపోయినా 200 కోట్లు అడ్వాన్స్ పేమెంట్‌లు ఇచ్చేశారని, ఆ నిధులు పొందిన వారు నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. కేంద్రనిధుల దుర్వినియోగంపై విచారణ జరపమని ముఖ్యమంత్రికి మూడు పర్యాయాలు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆ ఫిర్యాదులు విచారణకు రాకుండా ఎవరో అడ్డుకుంటున్నారని చెప్పారు. గృహ నిర్మాణ రంగంప మీకు సంపూర్ణ అవగాహన ఉన్నందున ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీ సెంటర్ ఆఖస్మిక తనీఖి



**సీతారామపురం సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఎత్తు,బరువులను పోషణ ట్రాకర్‌యాప్‌తో పాటు రిజిష్టర్లలలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ షేక్ చాను అన్నారు. ఆమె మంగళవారం రంగనాయుడు పల్లి అంగన్ వాడీ కేంద్రాన్ని ఆఖస్మికంగా తనీఖి చేశారు. సిబ్బంది కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటిస్తు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపీణి చేయాలన్నారు.పిల్లలకు మెను ప్రకారం నాణ్యమైన బోజనం అందిస్తు ప్రీ స్కూల్ హాజరు శాతం పెరిగేలా చూడాలన్నారు.అనంతరం రిజిష్టర్లు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందించారు.

# ఆహార పంటలకు యూరియా



**వింజమూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** విం జమూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధి, లోని ఎరువుల దుకాణాల దారులు మొదటగా ఆహార పంటలు సాగు చేసే రైతులకు యూ రియా విక్రయించాలని ఏడీఏ శేషగిరిరావు అన్నా రు. మంగళవారం వింజమూరు పట్టణం లోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్బండీ డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ మొదలైన నేపథ్యంలో ఎరువుల దుకాణాల దారులు వివిధ రకాల ఆహార పంటలు సాగు చేస్తున్న రైతులకు యూరియా అందించాలన్నారు. ప్రస్తుతం యూరియా కొరత ఉన్నందువలన జామాయిల్ సాగు చేస్తున్న రైతులకు పెద్ద మొత్తంలో యూరియా విక్రయించవద్దన్నారు. మండలానికి అవసరమైన సుమారు 50 టన్నుల యూరియా కొరకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన యూరియా సొసైటీకి అందించడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బందులకు గురి కాకుండా చూస్తామన్నారు. యూరియా నిల్వలు విక్రయాలు సంబంధించి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ సిఫార్సు చేసిన మేరకు రైతులు యూరియాను వినియోగించాలన్నారు. ఈ సందర్బంగా పలువురు ఎరువుల దుకాణదారులు కంపెనీలు లింకు ప్రొడక్ట్ కొనుగోలు చేస్తేనే యూరియా సరఫరా చేస్తామని చెప్తూ ఉండడంతో ఇబ్బందులు పడవలసి వస్తుందని డీలర్లు ఏడీఏ దృష్టికి తీసుకుని వచ్చారు. డీలర్ల సమస్యలను జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుని వెళ్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.వాసు, డీలర్ల సంఘం అధ్యక్షుడు వరికూటి మాల్యాద్రి రెడ్డి, మాల్యాద్రిరెడ్డి, సెక్రటరీ వడ్లమూడి రవికుమార్, డీలర్లు గనిపరమేశ్వరరావు, గని కోటేశ్వరరావు, వెంకట రమణయ్య, మల్లిఖార్జున, తిరుపతయ్య, హాజరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన పిడతాపోలూరు టిడిపి నాయకులు



**ముత్తుకూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** ముత్తుకూరు ఎస్ఐ నాగార్జున రెడ్డిని మంగళవారం పోలీస్ స్టేషన్లో పిడతపోలూరు టిడిపి నాయకులు దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. పలు విషయాలుపై చర్చించారు. ఆయన వెంట పెడతాపోలూరు టిడిపి నాయకులు నాగిరెడ్డి కోండరెడ్డి, నావురు పెంచలయ్య, బాబు నాయుడు, ఎస్‌కె కరిముల్ల ఉన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ



**వింజమూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** వింజమూరు జనసైనికులు ఆధ్వర్యంలో రవి స్కూల్లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉదయగిరి నియోజకవర్గ పీఏసీ సభ్యులు కొట్టే వెంకటేశ్వర్లు విచ్చేసి విద్యార్థులకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వ హించడం జరుగుతుందన్నారు. 100 శాతం స్ట్రైక్ రేట్‌తో జనసేన అధికారాన్ని అందిపుచ్చుకోవడం, రాజకీయ ముఖ చిత్రంలోనే ఒక సువర్ణ అవకాశం అని ఆయన కొనియాడారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో పవన్ కళ్యాణ్ ప్రతినిత్యం తన గళాన్ని వినిపించడం జరుగుతుందన్నారు. ఆయన చేపట్టిన పదవికి సమర్థవంతమైన నాయకత్వం వహించడం గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం డైరెక్టర్లు గుండా శ్రీనివాసులు, ఎన్.మహేష్, టీడీపీ మండల అధ్యక్షులు గూడా నర్సారెడ్డి, పఠాన్ రసూల్, ఎంపీటీసీ సభ్యులు మౌనిక, రాయలసీమ, కో కన్వీనర్ కమతం శ్రీను, రాజా, ఇమ్రాన్, వెంకీ, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్ పై పీడీ యాక్ట్ నమోదు

**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** జిల్లాను ప్రశాంత జిల్లాగా ఉంచడమే తమ ధ్యేయంగా జిల్లాలో యాక్టీవ్‌గా ఉంటూ తరచూ నేరాలకు పాల్పడే రౌడీ షీటర్లపై కఠిన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రబాబు నగర్‌కు చెందిన షేక్ తన్వీర్ అనే రౌడీ షీటర్ పై పిడి యాక్ట్ ప్రయోగించినట్లు జిల్లా యస్.పి. జి.కృష్ణకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ చట్టం క్రింద కేసు నమోదు చేస్తామని అయన స్పష్టం చేశారు. రౌడీ, కెడి, బిసిల ప్రవర్తనలో మార్పు లేకుండా ప్రజాశాంతికి భంగం కలిగిస్తే వారిపైనా పిడి యాక్ట్ నమోదుకు రంగం సిద్ధం చేస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో తన్వీర్ పై శిదీ యాక్ట్ ప్రయోగిస్తున్నట్లు జిల్లా యస్.పి. తెలిపారు. ఇతనిపై వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్, హత్యాయత్నం, దోపిడీ, దొంగతనం కేసులు వెరసి మొత్తం అతనిపై 11 కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. జిల్లా యస్.పి. మాట్లాడుతూ జిల్లాను ప్రశాంతమైన జిల్లాగా ఉంచడమే తమ ధ్యేయమని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నేర స్వభావాన్ని కొనసాగిస్తూ పదే పదే నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, పీడీ చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఏదైనా అసాంఘీక కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే వెంటనే సదరు సమాచారాన్ని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరు రూరల్‌లో కొత్తగా నియమితులైన వ్యవసాయ సొసైటీ చైర్మన్‌లకు సత్కారం



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కొత్తగా నియమితులైన ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల చైర్మన్‌లను, డైరెక్టర్లను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ రైతుల గౌరవాన్ని కాపాడుతూ, కూటమి ప్రభుత్వానికి, అలాగే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మంచి పేరు వచ్చేలా కొత్త చైర్మన్‌లు పనిచేయాలని సూచించారు. అలాగే ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌లు, డైరెక్టర్లను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాబక్షు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 24 మంది పేదలకు 21 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కలిసి మంగళవారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న లబ్ధిదారులు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవినిలా మారిందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు వైసీపీ కార్యాలయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. నేతలు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహానేత అందించిన సుపరిపాలనను, ఆయన తీసుకొచ్చిన ప్రజా సంక్షేమ సంస్కరణలను స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన దాతలను అభినందించారు.

# మున్సిపల్ షాపుల అద్దె మొండి బకాయిదారులకు హెచ్చరిక



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 2,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన స్థానిక కే ఎ సి బిల్డిం గ్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ 5 (రూ.6,20,256/), షాప్ నెంబర్ 6 (రూ.1,21,170/), షాపు నెంబర్ 9 (రూ.2,22,453/ ) నిర్వాహకులు అద్దె బకాయిలు ఉన్నారు. నిర్వాహకులుగా ఉన్న వారు నెల్లూరు నగరపాలక సంస్థకు బాడుగ చెల్లించకుండా ఉన్నందున, వారికి ఇదివరకే చాలాసార్లు నోటీసులు జారీచేసినా, ఎంతకీ సంబంధిత షాపు నిర్వాహకులు స్పందించకపోవడంతో, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ ఆదేశాల మేరకు, నిర్వాహకులను మొండి బకాయిలుగా పరిగణించి అధికారులు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సి.వి.ఎస్. కిరణ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఆయా షాపులను సీజ్ చేశారు.ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ భవన యజమానులు, అద్దెదారులు సకాలంలో నగరపాలక సంస్థకు చెందిన అన్ని రకాల పన్నులను వెంటనే చెల్లించి నెల్లూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

# నేడు ఎమ్మెల్యే రాక



కొడవలూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: మండలంలోని యల్లాయపాలెం పంచాయతీలో అంతర్గత సిసి రోడ్డు, బీటీ రోడ్డు శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి రానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. అదేవిధంగా విడవలూరు మండలం సాయిబాబా కళ్యాణ మండపం నందు పార్లపల్లి, వరిణి సొసైటీల కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరి హాజరయ్యి విజయవంతం చేయాలని కోరారు.

## రైతు బాంధవుడు కొండ్రెడ్డి రంగన్న ఘన సన్మానం చేసిన రైతులు



**సంగం సెప్టెంబర్ 2 ప్రభాతవార్త** అజాతశత్రువు, రైతు బాంధవుడు విజయాడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగన్న అని రైతులు ప్రశంసలతో ముంచెత్తారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెం పాల సొసైటీకి ముఖ్య అతిధిగా వచ్చిన సందర్బంగా పాడి రైతులందరు ఆయనను శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా పాడి రైతులు మాట్లాడుతు 15 సంవత్సరాలుగా ఆయనతో ఎంతో అనుబంధం ఉందని అన్నారు. విజయడైరికి వెళ్ళి రంగన్నా ! మాకు ఈ సమస్య ఉంది అంటే వెంటనే పరిష్కరించే వాడని వారు తెలిపారు. రైతులందర్ని అప్యాయతగా పలకరించే మంచి మనస్సున్న వ్యక్తి అని, పార్టీలకు అతీతంగా ఎవ్వరు వెళ్ళినా సమస్య చెబితే వెంటనే పరిష్కరించే వాడని రైతులు పేర్కున్నారు. అనంతరం విజయాడైరి బోర్డు డైరెక్టర్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం వెంకటశేషారెడ్డి మాట్లాడుతు విజయా డైరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి డైరీ అభివృద్ధికోసం ఎంతో కృషిచేశారని నేషనల్ డైరి డవలప్‌మెంట్ బోర్డు వారి ద్వారా, 2 కోట్లతో మిషనరీ కూడా తెప్పించారని తెలిపారు. కరోనా సమయంలో, తుఫాన్ సమయంలో తన సొంత నిదులతో ప్రజలకు ఎంతో సహాయం చేసిన మంచి మనస్సున వ్యక్తి అని వారు కొనియాడారు. ఈ సందర్బంగా విజయా డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి రైతులందరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా విజయా డైరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని అందరు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో విజయాడైరి ఎం.డి పిసి కృష్ణమోహన్, ఎం.శ్రీనివాసరావు ఎంజీఆర్ పైనాన్స్, జి. శివయ్య అడ్మిన్, సిహెచ్ వెంకటేశ్వర్లు ఎంజీఆర్ పిఅండ్ఐ, పి సుబ్రమణ్యం రూటుసూపర్‌వైజర్, పి రవి సూపర్‌వైజర్లు జి.ఎల్ నరసారెడ్డి , మాజీ రూటు సూపర్‌వైజర్ బి.వెంకురెడ్డి, అన్నారెడపాళెం పాల సొసైటీ చైర్మన్ బేతు సుబ్రమణ్యం, బేతు వెంకటేశ్వర్లు, డేగా వెంకయ్య, శింగంశెట్టి శీనయ్య, మావిళ్ళ సుబ్బారావు, ఉడతా వెంకటరమణయ్య, గండవరపు పెంచలయ్య, బత్తల మల్లికార్జున, పూసాల వెంకటేశ్వర్లు, పప్పు చంద్రశేఖర్, పాల సొసైటీ సెక్రటరీ ఉడతా రవి పాడి రైతులు పాల్గోన్నారు.

## ఉవ్వెత్తున ఎగిసినకెరటం మనజనసేనాని పవన్‌కళ్యాణ్ : ఎమ్మెల్యే



**జలదంకి, సెప్టంబర్ 2, ప్రభాతవార్త:** సినీరంగంలో మకుటంలేని మహరాజుగ వెలుగొంది, రాజకీయరంగ ప్రవేశంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉవ్వెత్తున ఎగిసిపడిన కెరటం మనజనసేనానని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం మండలకేంద్రమైన జలదంకిలో ఘనంగా జరిగాయి. జనసేన ఉదయగిరి నియోజకవర్గ సీనియర్‌నేత నిమ్మలపల్లి రామచైతన్య ఆధ్వర్యంలో ,మండలపార్టీ కార్యవర్గ సహకారంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజులను వేడుకగ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే కాకర్ల విచ్చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు మననెల్లూరులో జన్మించిన పవర్‌స్టార్ మొన్న ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల కూడదన్న దృఢసంకల్పంతో కూటమిని ఏకత్రాటిపైకి తెచ్చిన ఇష్కళంకపజానాయకుడని కొనియా డారు .ఫలితంగానే ఎన్నికల్లో కూటమి ఘనవిజయానికి కారణమని స్పష్టీకరించాడు. పవన్‌కళ్యాణ్ పోరాటస్ఫూర్తి అసమాన్యమని ఇక్కట్లు ఎదురైన వెనుకంజవేయక ముందుకురికే నైజం మెచ్చుకోదగ్గదని అన్నారు .మానవీయం ఆయనలోవున్న సుగుణమని, కష్టముందంటే వెంటనే రెస్పాండ్ కావడమే కాకుండ పేదలకు అండగ వుండాలన్న మనస్తత్వం ఆయనను ముందుకు తీసుకుపోతుందని అన్నారు. ఏదోఒకటి చేయాలన్న తపనతోనే నిత్యం పనిచేస్తుంటాడని చెప్పారు. ఆయన స్వీకరించిన మంత్రిత్వశాఖ మన ఉదయగిరికి అచ్చుగుద్దినట్లు సరిపోతుందని రూరల్‌డవలప్‌మెంటునుంచి ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, ఫారెస్ట్ వంటి మేజర్‌శాఖలన్ని ఆయన అండర్‌లోనివే కాబట్టి మనం అభివృద్దిలో ముందుకుపోవడానికి అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. నేను రెండు మూడు సందర్బాలలో డిప్యూటిసిఎంను కలిసి మంచినీటి సమస్య,, పంచాయతీ సమస్యలపై మాట్లాడడం జరిగిందని వివరించాడు. ఫ్లోరైట్ సమస్యపైకూడ పవన్‌కళ్యాణ్‌కు స్పష్టమైన అవగాహనవుందని కచ్చితంగ సాయంచేస్తానని హామీఇచ్చారన్నారు. త్వరలో మన ఉదయగిరికి ఆయన వచ్చేఅవకాశంకూడ వుందని హర్షధ్వానాలమధ్య తెలిపాడు. అంతేకాకుండ త్వరలోజరిగే అసంబ్లీ సమావేశాలలో మరోమారు డిప్యూటిని కలసి నియోజకవర్గ సమస్యలను వివరించి పరిష్కారందిశగ కృషిచేస్తానని దీమావ్యక్తంచేశాడు. తాను ఎంఎల్ఎ అయిన అనంతరం ఉదయగిరి ప్రజారోగ్యంపై దృష్టిపెట్టానని అందులో భాగంగ వింజమూరులో డయాలసెస్, ఉదయగిరి ఆసుపత్రి అభివృద్దికి కోట్లాది రూపాయలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. దీంతో ఆసుపత్రి రూపురేకలు మారనున్నాయని అలాగే విద్య, ఉద్యోగాలపైకూడ ప్రత్యేకదృష్టి పెట్టానని చెప్పారు. గత 40ఏళ్ళ కాలంలో ఇరిగేషన్‌పరంగ కొంత అన్యాయం జరిగిందని ఆరంగంపై దృష్టిపెట్టడంతోపాటు సోమశిలప్రాజెక్టు విషయంలో స్పష్టమైన అవగాహనతో ముందుకెళతామని స్పష్టంచేశారు. సోమశిల మైన్‌కెనాల్, మేజర్‌కెనాల్‌లకు సంబంధించి సీనియర్ నాయకులుకాలువలపై అనుభవమున్న ప్రాజెక్ట్ వైస్‌ప్రసిడెంట్ పులిగుంట మధుమోహన్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డిలకు భాద్యతలు అప్పగించామని వారు కాలువలపై పర్యటించి సమగ్రనివేదిక ఇచ్చిన అనంతరంతగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఎంఎల్ఎ కాకర్ల, ఉదయగిరి నియోజకవర్గ పిఒసి కొట్టే వెంకటేశ్వర్లు, మండల టిడిపి అధ్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి, జలదంకి సొసైటి అధ్యక్షుడు కరియావుల అప్పల నాయుడు, వంటేరు జయచంద్రారెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, నిమ్మలపల్లి రామచైతన్య, జనసేన మండలాధ్యక్షుడు తోట మురళి, బిజెపి జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి, చల్లా హనుమారెడ్డి, తదితరుల చేతులమీదుగ కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. డిప్యూటి సిఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటు, రాజకీయాలలో మరింత ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## ఈత పోటీల్లో కోవూరు వాసి ఘనత



**కోవూరు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** బెంగుళూరులో ఆగస్టు 31వ తేది నిర్వహించిన జాతీయ స్థాయి ఈత పోటీల్లో 61ఏళ్లు పైబడిన విభా గంలో కోవూరుకు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి కూట్ల శ్రీనివాసులు జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని జాతీయ స్థాయిలో 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నా డు. ఈ మేరకు ఆయనను మంగళవారం వైసీపీ నా యకులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరిం చారు. ఈ వయస్సులో కూడా శ్రీనివాసులు ఈత పట్ల ఉన్న ప్రత్యేక మక్కువతో ఇప్పటికే అనేక పర్యా యాలు జిల్లా స్థాయి, జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధించి కోవూరు పటిష్టతను మరింత ఇనుమడింపజేశారన్నారు. అటువంటి వారిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోజిల్లా వైసీపీ రైతు అధ్యక్షుడు నరసింహులురెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కూట్ల ఉమా, జిల్లా వైసీపీ యాక్టివ్ కార్యదర్శి సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జుబేర్‌బాషా, వెంకటరమణారెడ్డి, కె. ప్రసాద్ వైసీపీ నేతలు శ్రీధర్, వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## అన్నారెడ్డిపాళెం పాల సొసైటీకి జిల్లాలో గుర్తింపు వుంది - విజయా డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి



**సంగం, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** సంగం అన్నారెడ్డిపాళెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి జిల్లాలోనే ఒక గుర్తింపు ఉందని విజయాడైరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అభినందించారు. మంగళవారం అన్నారెడ్డిపాళెం పాల సొసైటీలో రైతులకు విజయదశమి ప్రోత్సహక బహుమతులు పంపిణి చేసిన సందర్బంగా ఆయన మాట్లాడుతు ఈ సొసైటీలో పాడి రైతులు, సొసైటీ సభ్యులు ఎప్పుడు ఐకమత్యంతో ఉంటారని, ఈ సొసైటీ నాకు పులగం వెంకటశేషారెడ్డి ఉన్నప్పటి నుండి తెలుసునని అన్నారు. ప్రస్తుత సొసైటీ అధ్యక్షులు బేతు సుబ్రమణ్యం, డైరక్టర్లు అందరు కలిసి సొసైటీ అభివృద్దికి మరింత పాటుపడాలని అన్నారు. అనంతరం విజయడైరీ ఎండి కృష్ణమోహన్ మాట్లాడుతు 20 సంవత్సరాలుగా ఈ సొసైటీలో పాడి రైతులకు ప్రోత్సహకాలు ఇవ్వడం జరుగుతుందని, ఇది ప్రశంసించదగ్గ విషయమని అన్నారు. ఈ సొసైటీ ద్వారా ఉదయం సాయింత్రం 250 లీటర్లు పాలు వస్తున్నాయని తెలిపారు. ఈ సొసైటీలో వచ్చే ఆదాయం రైతులందేనని అన్నారు. అదే ప్రవేటు డైరీలకు పాలు పోస్తు యజమానికి ఆదాయం వస్తుందని అన్నారు. ఈ సొసైటీ అధ్యక్షులు బేతు సుబ్రమణ్యం, వెంకురెడ్డి, ఉడతారవి అందరు నాకు తెలుసు సొసైటీ అభివృద్దికి అందరు సమిష్టగా కృషి చేస్తుంటురు అని ఆయన ప్రశంసించారు. అనంతరం డైరక్టర్ కోట. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు 25 శాతంతో మందులు ఇస్తున్నామని అన్నారు. 25 శాతం సబ్సిడీతో దాణా కూడా ఇస్తున్నామని చెప్పారు. ఈ సందర్బంగా బేతు వెంకటేశ్వర్లు మాట్లాడుతు సొసైటీ మైన్‌టెన్స్‌కి కమీషన్ పెంచాలని కోరారు. ఈ సందర్బంగా సొసైటీలోని పాడి రైతులందరికి విజయదశమి కానుక అందజేశారు. ఈకార్యక్రమంలో విజయాడైరి ఎం.డి పిసి కృష్ణమోహన్, ఎం.శ్రీనివాసరావు ఎంజీఆర్ ఫైనాన్స్, జి. శివయ్య అడ్మిన్, సిహెచ్ వెంకటేశ్వర్లు ఎంజీఆర్ పిఅండ్ఐ ,పి సుబ్రమణ్యం రూటు సూపర్‌వైజర్, పి రవి సూపర్‌వైజర్లు జి.ఎల్ నరసారెడ్డి , మాజీ రూటు సూపర్‌వైజర్ బి .వెంకురెడ్డి, అన్నారెడ్డిపాళెం పాల సొసైటీ చైర్మన్ బేతు సుబ్రమణ్యం, బేతు వెంకటేశ్వర్లు, డేగా వెంకయ్య, శింగంశెట్టి శీనయ్య, మావిళ్ళ సుబ్బారావు, ఉడతా వెంకటరమణయ్య, గండవరపు పెంచలయ్య, బత్తల మల్లికార్జున, పూసాల వెంకటేశ్వర్లు, పప్పు చంద్రశేఖర్, పాల సొసైటీ సెక్రటరీ ఉడతా రవి పాడి రైతులు పాల్గోన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

### - మౌళికవసతుల కల్పనకే ప్రాధాన్యత : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల నేతృత్వంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణ కోసం అవసరమైన నిధులను పన్నుల ద్వారా మాత్రమే సమీకరించగలమని, ప్రజలందరూ తమకు సంబంధించిన పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములుగా సహకరించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో రోడ్ల నిర్మాణాలు, డ్రైన్ కాలువలు, డివైడర్ల ఏర్పాట్లు, మొక్కల పెంపకం, విద్యుత్ వీధి దీపాలు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పార్కుల నిర్వహణ తదితర ప్రజాప్రయోజన కార్యక్రమాలను నిర్వహిస్తూ, వాటి నిర్వహణ పనులను కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా చేపడుతున్నామని తెలిపారు. ప్రజా ప్రయోజన కార్యక్రమాలు, నగరాభివృద్ధి పనులను నిరంతరం నిర్వహించేందుకు ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులను ప్రణాళిక బద్ధంగా వినియోగిస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

**కార్పొరేషన్ నిధులను మౌళికవసతుల కల్పనకు మాత్రమే కేటాయిస్తాం** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు, నగరాభివృద్ధికి అవసరమైన మౌళికవసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ కార్పొరేషన్ నిధులను వినియోగించనున్నామని, ఇకనుంచి ఇతర కార్యక్రమాలకు సంబంధించిన దుబారా ఖర్చులను పూర్తిస్థాయిలో తగ్గించి ప్రజా ప్రయోజన కార్యక్రమాలను మాత్రమే చేపట్టనున్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

**కార్పొరేషన్ ఆధ్వర్యంలో** గత కొన్ని సంవత్సరాలుగా పండుగలు, ఇతర సాంస్క ృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కోట్ల రూపాయల మేరకు నిధులను వెచ్చించడంతో పాటుగా కార్పొరేషన్ కార్మికుల సేవలను కూడా అందిస్తున్నామని కమిషనర్ తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ అభివృద్ధిని కాంక్షిస్తూ దుబారా ఖర్చులను తగ్గించుకునే విధానంలో నూతనంగా చేపట్టిన సంస్కరణలో భాగంగా నగరవ వ్యాప్తంగా జరిగే పండుగలు సాంస్కృతిక కార్యక్రమాలలో కార్పొరేషన్ నుంచి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా అంశాలలో మాత్రమే ఇకనుంచి సేవలను అందించేలా నిశ్చయించుకున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. కావున అందరు ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ పరిధిలోని పౌరులందరూ సమస్య తీవ్రతను అర్థం చేసుకొని నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## దాతృత్వం చాటుకున్న డాక్టర్ రామస్వామి



**కావలి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** కావలి పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ మంచిగంటి రామస్వామి సతీమణి మంచిగంటి.లక్ష్మీ రేఖ జ్ఞాపకార్థంగా సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కావలి పట్టణం పరిసర ప్రాంతాలైన బుడగుంట గిరిజన కాలనీ, సర్వాయిపాలెం గిరిజన కాలనీలలోని గిరిజనులం దరికీ అన్నదానం చేయడంతో పాటు 200 మందికి దుప్పట్లు పంపిణీ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ సభ్యులు ప్రసాదరావు, ఖాదర్ భాషాలు మాట్లాడుతూ డాక్టర్ మంచిగంటి రామస్వామి గారు వారి సతీమణి శ్రీమతి మంచిగంటి లక్ష్మీ రేఖ జ్ఞాపకార్థంగా పేదలకు అన్నదానము చేయడమే కాకుండా 200 మందికి దుప్పట్లు వితరణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. డాక్టర్ రామస్వామి అనేక సందర్భాల్లో అనేక రకాలుగా పేదలకు సేవలందిస్తున్న గొప్ప మనసున్న డాక్టర్ అని కొనియాడారు. సంయుక్త సేవా సంస్థ ద్వారా అనేకసార్లు పేదలకు సేవలు అందించిన మహనీయుడని తెలిపారు. డాక్టర్ రామస్వామి సేవలు మరువ లేనివని తెలిపారు. కీశే మంచిగంటి.లక్ష్మీరేఖ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు. డాక్టర్ రామస్వామి కుమారుడు వెంకటసౌరవ్, కోడలు రక్షణసంస్థ వ్యవస్థాపకఅధ్యక్షుడుసురేంద్ర పాల్గొన్నారు

## ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్యను సత్కరించిన అమరా



**కావలి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆశీస్సులతో ఆర్యవైశ్య ప్రముఖులు కావలి మున్సిపల్ మాజీ చైర్మన్, కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి తనయురాలు పోతుగంటి అలేఖ్య కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా వారి స్వగృహమునందు కావలి పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు, టిడిపి పట్టణ మూడవ క్లస్టర్ ఇంచార్జ్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా వారి మిత్రబృందంతో కలిసి పోతుగంటి అలేఖ్య శ్రీకాంత్ లను దృశ్యాలతో ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చీదెళ్ళ సాయి, సోమిశెట్టి వెంకట రవి శేఖర్ రావు, సోమిశెట్టి ఉమా మహేశ్వరరావు, ఏల్చూరి వెంకట రవికుమార్ ,జొన్నలగడ్డ రాజశేఖర్, పేటేటి వెంకటరమ ణ,వెలుగురి వెంకట ఈశ్వర్ నవీన్ కుమార్, అమరా మల్లికార్జున, తదితరులు పాల్గొని సత్కరించడం జరిగింది

## మానస సెంటర్ గణనాథుని వద్ద భారీ అన్నదాన కార్యక్రమం



**కావలి, సెప్టెంబరు2, ప్రభాతవార్త:** కావలి, కలుగోళమ్మ తల్లి ఆలయ ప్రాంగణమునందు మానస సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా వైభవంగా జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవములకు ఏర్పాటుచేసిన భారీ గణనాథుని వద్ద మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. భక్తులు ప్రజలు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది అనంతరం శ్రీ గణనాథుని దర్శించుకుని పూజలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు, టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, టిడిపి నాయకులు సూరిశెట్టి రామకృష్ణ, వర్ధినేని వెంకటేశ్వర్లు నాయుడు, మహేష్ నాయుడు. ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని అందరికీ అన్న ప్రసాదం అందే విధంగా ఏర్పాట్లు చేపట్టడం జరిగింది

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



**కోవూరు , సెప్టెంబర్ 2 ప్రభాతవార** రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల ను ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ తదితరులు నెల్లూరులోని విపిఆర్ నివాసంలో ఘనంగా నిర్వ హించారు. ముందుగా కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాం తమ్మ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గారు ఇలాంటి జన్మదిన వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షిం చారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టడంతో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ కూటమి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని చెప్పారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ పాలన సాగిస్తున్నారని కొని యాడారు. వేంకటేశ్వరస్వామివారి ఆశీసులు పవన్ కల్యాణ్‌పై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అటు పార్టీని పటిష్టం చేస్తూ_నే... రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని వివరించారు. పేద ప్రజల సమగ్రా భివృద్ధే ధ్యేయంగా మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోవూరు జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, సుందరరామిరెడ్డి, వీర మహిళలు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు కష్టపడి నిజాయితీగా పని చేయాలి



**కావలి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ కష్టపడి నిజాయితీగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు తెలియజేశారు వడ్డేశ్వరంలోని ఆగ్రోస్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రంలోని అన్నీ జిల్లాల నుండి వచ్చిన డీఈవోలు, జూనియర్ అకౌంటెంట్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు ఆగ్రోస్ కార్యాలయ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడారు ఆగ్రోస్ సంస్థను దినదినాభివృద్ధి చెందే దిశగా అడుగులు వేయవలసిన తరుణం వచ్చిందని అందరూ కష్టపడి పని చేయాలని తెలియజేశారు అదేవిధంగా ఆగ్రోస్ సంస్థ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యాచరణపై సిబ్బందికి దిశానిర్దేశం చేయడం జరిగింది

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 2, ప్రభతవార్త** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినంను జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు మంగళవారం జనసేన నగర పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు, గ్లూకోజ్, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజయ్‌బాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభు త్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రిజినల్ కోఆర్డినేటర్ గుడ్లూరు నాగరత్నం, జిల్లా కార్యదర్శి షేక్ అలియా, నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్ బాబు, నగర కార్యదర్శి సుమంత్ ఆముదాల, డివిజన్ ఇంచార్జులు చిత్తూరు రాము, కనగలూరు సురేష్ , శ్రీనివాసులు, శ్రీమంతుల కిషోర్ , చుక్కల భీమయ్య, సత్యేంద్ర, వీరమహిళలు హైమావతి, మల్లిక, నాయకులు గంగిశెట్టి నరసింహ, హరీష్, శేషయ్య, సుబ్బు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

### - జిల్లా జనసేన పార్టీ కార్యాలయం వద్ద అన్నదానం



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** భావితరాల భవిష్యత్తు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తోనే అని జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున్ యాదవ్ అన్నారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం స్థానిక జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి లో గర్భిణీ స్త్రీలకు పండ్లు బిస్కట్స్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచన మేరకు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పవన్ చేతుల్లోనే ఉందన్నారు. జనసేన పార్టీ పట్ల ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజా నాయకుడని, ఈ సత్యాన్ని దేశ ప్రజలంతా గుర్తించారని చెప్పారు. పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయనే రాష్ట్ర సీఎం అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ పేరు చెప్తేనే వైకాపాకు వెన్నులో వణుకు పుడుతుంది అన్నారు. మహిళలు ఆయనకు నీరాజనాలు పలుకుతున్నారని, స్త్రీ శక్తి పథకం మహిళలకు వరం అన్నారు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఇది రాష్ట్రానికి శుభ పరిణామం అన్నారు. వేములపాటి అజయ్ కుమార్ సారథ్యంలో నెల్లూరు జిల్లా అభివృద్ధి పదంలో నడుస్తుందని మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, పావుజెన్ని చంద్రశేఖరెడ్డి, ఆఫీస్ ఇంచార్జి జమీర్, కృష్ణా రెడ్డి, రవి, శివకృష్ణ, కస్తూరి, నందిని, వరలక్ష్మి, జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించండి: కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో సూచించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ క్యాంటీన్ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక డైకస్ రోడ్డు వెంగళ రావు నగర్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ మంగళవారం సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యత, ప్రమాణాలను పరిశీలించారు. కమిషనర్ స్వయంగా క్యాంటీన్లో ఆహారాన్ని స్వీకరించి నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ప్రజలతో మాటాడుతూ క్యాంటీన్లో అందుతున్న సౌకర్యాలు, నిర్వాహకుల ప్రవర్తన గురించి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా ఉన్న అన్ని అన్న క్యాంటీన్లలో చల్లటి, సురక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, టోకెన్ విధానం ద్వారా మాత్రమే ప్రజలకు ఆహారాన్ని అందించాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. నిర్దేశించిన మోతాదు నాణ్యమైన ఆహారం అందించాలని, క్యాంటీన్ ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆహారం ప్లేట్లు, ఇతర వంట సామాగ్రిని క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకొని, విచ్చేసే ప్రజలతో సాదరంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు క్యాంటీన్ కు విచ్చేసి ఆహారం స్వీకరిస్తున్న వారి సంఖ్య, సరఫరా చేస్తున్న ఆహారం మోతాదు, తదితర వివరాలను ఎప్పటికప్పుడు క్యాంటీన్ల వారీగా నివేదిక అందించాలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

## స్వచ్ఛమైన తాగునీరు సరఫరాకు ప్రణాళికలను సిద్ధం చేయండి: కమిషనర్ వై.ఓ.నందన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్య వేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 17 వ డివిజన్ పార్థసారథి నగర్ ప్రాంతంలో పర్య టించారు. డివిజన్ పరిధిలో తాగునీటి సరఫరా సమస్యను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసు కురాగా, స్పందించిన కమిషనర్ ఇంజనీరింగ్ విభాగం అధికా రులతో చర్చించారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా వెం టనే ప్రణాళికలను రూపొందించి పనులను ప్రారంభించాలని కమిషనర్ ఆదేశించారు. అనం తరం స్థానిక వెంగళరావు నగర్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నివాస స్థలానికి సంబంధించి మార్గాన్ని నిర్దేశించాలని విజ్ఞప్తి చేసిన అర్జీదారులతో కమిషనర్‌ప్రత్యక్షంగా మాట్లాడిసమస్యను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయంలోగా సమస్యకు శాశ్వతపరిష్కారం అందించాలని పట్టణప్రణాళిక విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## జనసేనా అధినేత జన్మదినోత్సవం సందర్భంగా నగరంలో పవర్ వాక్ సేవా కార్యక్రమాలు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా జనసేనపార్టీ జిల్లా ఇంచార్జి, జాతీయ మీడియా ప్రతినిధి, వేముల పాటి అజయ్ ఆధ్వర్యంలో నగరంలో స్థానిక విఆర్సి సెంటర్ నుండి గాంధీ బొమ్మ వరకు పవర్ వాక్ నిర్వహించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి వారి ఆనందాన్ని చాటుకున్నారు. ఈ వేడుకలలో వేములపాటి ముఖ్య అతిధిగా పాల్గొని మట్లాడారు. తమ పార్టీ ఆద్వర్యంలో గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా హెల్త్ క్యాంప్, అన్నదానం, బ్లడ్ డొనేషన్, పేదలకు బట్టలు పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సేవాకార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని, ఇందుకు సహకరించిన అందరికీ దన్యవాదాలు తెలిపారు. జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుణుకులకిషోర్ మాట్లాడుతూ డిప్యూటి సి ఎం గా పవన్ కళ్యాణ్ చారిత్రాత్మకంగా తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శిస్తూ విఆర్సీ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ పవర్ వాక్ నిర్వహించి గాంధీ బొమ్మ దగ్గర డిజే, బాణసంచాలతో జిల్లా జనసేన మెగా అభిమాన శ్రేణులన్నీ భారీ కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ప్రజల మంచి కోసం తన విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని రాజకీయాల్లోకి పవన్ రావడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిషారంకోసం అహర్నిశలు పాటుపడే నిస్వార్థ నేత తమ అదినేత అని కొనియాడారు. దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీలకి సాధ్యం కానీ నూరుశాతం ఉతీర్ణతతో ప్రజల అభిమానం చొరగొన్నారని, ఆయన నిండు నూరేళ్ల సంతొషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూనెమల్లి మల్లికార్జున యాదవ్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఏటూరిరవికుమార్, రూరల్ నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరామ్, కార్యాలయ ఇంచార్జ్ జమీర్, వీర మహిళలు కస్తూరి, నందిని, వరలక్ష్మి, లక్ష్మి, వాణి జనసేన నాయకులు పాల్గొన్నారు.